ఆదిలాబాద్ వార్త
మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్
శుక్రవారం 8, మే 2026





## రైతుల నుంచి చివరి గింజ వరకు

# కొనుగోలు చేస్తాం

* రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

**మంచిర్యాల బ్యూరో, మే 7, ప్రభాతవార్త**

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేస్తుందని, ఈ క్రమంలో చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలో గల శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మండల తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మ, వైస్ చైర్ పర్సన్ వినయ్ కుమార్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రైతుల వద్ద నుండి చివరి గింజ వరకు కొనుగోలు చేసే విధంగా కార్యాచరణ రూపొందించడం జరిగిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు, రవాణా అంశాలలో వేసవి ఉష్ణోగ్రతతో పాటు ఇతర రాష్ట్రాలలో కొనసాగుతున్న ఎన్నికల సందర్భంగా హమాలీల కొరత ఏర్పడిందని తెలిపారు. ఈ పరిస్థితులలో సైతం జిల్లాలో రోజుకు 150 లారీల ధాన్యం తరలించడం జరుగుతుందని తెలిపారు. అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న ధాన్యం త్వరగా ఆరబెట్టి రైస్ మిల్లులకు తరలించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆలోచన మేరకు జిల్లాలో గోదాములను అద్దెకు తీసుకుని కొనుగోలు చేసిన ధాన్యం తడవకుండా నిల్వ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలోని రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని, రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణమాఫీల ద్వారా అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు.. ఈ క్రమంలో ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం మిగతా 2లో..



## వరదల సమయంలో శాఖల సమన్వయం కీలకం

★ కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, మే 07, ప్రభాతవార్త:**

రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరదల నివారణ, విపత్తు నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరద ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాలు, చెరువులు, వాగులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ముందస్తు సన్నద్ధతలో మిగతా 2లో..

## పీఎం సూర్యఘర్ పథకంను సద్వినియోగం చేసుకోవాలి

**ఆసిఫాబాద్ టౌన్ , మే 7, ప్రభాతవార్త :**



పీఎం సూర్యఘర్ పథకంను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మార్మాట్, డేవిడ్ పేర్కొన్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జన్కాపూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తున్నామని, రైతులకు ఆర్థిక భారం తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్నామని చెప్పారు. రైతులకు రాయితీలతో కూడిన మిగతా 2లో..

## ఎక్సైజ్ సోదాల్లో భారీగా బెల్లం, పటిక పట్టివేత




**చింతలమానేపల్లి, మే 7, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని లంబడిహెట్టి, గుప్పుగుడెం గ్రామాల్లో నాటు సారాయి తయారీ స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు 40 లీటర్ల నాటు సారాయి, 200 కిలోల బెల్లం, 50 కిలోల పటిక, 400 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే నాటు సారాయి తరలిస్తున్న ఒక బైక్‌ను సీజ్ చేసి, ఘటనలకు సంబంధించి నాలుగు కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల అనంతరం గ్రామాల్లో నాటు సారాయి, గంజాయి తదితర మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సీఐ అక్బర్ హుస్సేన్, ఎస్సైలు ఐ. సురేష్, పి. రాజేశ్వర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ఇండ్ల గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

**ఆసిఫాబాద్, మే 7, ప్రభాతవార్త :**



జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా ఇండ్ల గణనను పకడ్బందీగా చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్లికేరి అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ముఖ్య ప్రణాళిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంచాలకులు మాట్లాడుతూ ఈ నెల 11 నుండి జూన్ 9 వరకు నిర్వహించే ఇండ్ల గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. అన్ని స్థాయిలలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ పూర్తి చేయాలని, 10 లోగా ఎన్యుమరేటర్లకు, సూపర్వైజర్లకు మెటీరియల్ కిట్ లు, గుర్తింపు కార్డులు అందజేయాలని తెలిపారు. స్వీయ గణనపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. ఇండ్ల గణన శిక్షణకు బ్యాచ్స్ హాజరు, సిఎంఎంఎస్ పోర్టల్ లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 11 నుండి జూన్ 9 వరకు నిర్వహించనున్న ఇండ్ల గణన ప్రక్రియ కొరకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 994 మంది ఎన్యుమరేటర్లు, 174 మంది సూపర్వైజర్లను నియమించి, 1689 ఇండ్ల జాబితా బ్లాక్ లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇండ్ల గణన ప్రక్రియలో విధులు నిర్వహించే వారికి అన్ని స్థాయిలలో శిక్షణ పూర్తి చేయడం జరిగిందని, స్వీయ గణనను చేసుకునేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ప్రజలందరికీ తెలిసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆర్టిసి, స్వయం సహాయక సంఘాల మహిళలకు స్వీయ గణనపై అవగాహన కల్పించి లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి వాసుదేవరెడ్డి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వరదల సమయంలో శాఖల సమన్వయం కీలకం

**(మొదటిపేజీ తరువాయి)**

భాగంగా జిల్లాలో ఫ్లడ్ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. దీని ద్వారా రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య శాఖల మధ్య సమన్వయాన్ని పరీక్షిస్తామన్నారు. సహాయక శిబిరాల ఏర్పాటు, రక్షణ చర్యలు, కమ్యూనికేషన్ వ్యవస్థలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. విపత్తు సమయంలో ప్రజలకు ముందస్తు హెచ్చరికలు అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, ఆర్‌డీఓ రత్న కళ్యాణి పాల్గొన్నారు.

## పీఎం సూర్యఘర్ పథకంను సద్వినియోగం చేసుకోవాలి

**(మొదటిపేజీ తరువాయి)**

సోలార్ పథకాలు సద్వినియోగపరుచుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలను జీరో స్థాయికి తీసుకురావడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యుత్ వినియోగంలో నిర్లక్ష్యం, అజాగ్రత్త, అలసత్వం కారణంగానే అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయని, స్వీయ నియంత్రణ ముఖ్యమని అన్నారు. రైతులు మోటార్లు, పంప్‌సెట్లు వాడేటప్పుడు భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యుత్ శాఖ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టి జిల్లా లోని అన్ని గ్రామాలలో ప్రమాదకర లైన్లు, వంగిన విద్యుత్ స్తంభాలు, పాత వైర్లను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపడుతున్నారని అన్నారు. వినియోగదారులకు నిరంతరాయంగా, సురక్షితంగా విద్యుత్ సరఫరా చేయడం కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఈ తెలిపారు. అనంతరం ఎన్పీడీసీఎల్ లో రైతుల శ్రేయస్సు కొరకు అందిస్తున్న గృహ జ్యోతి, పొలంబాట, ప్రజాబాట, విద్యుత్ భద్రతల గురించి దృశ్య రూపకంగా రూపొందించిన వీడియో విజువల్ ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ అనిల్ కుమార్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, పాక్స్ చైర్మన్ అలీ బిన్ అహ్మద్, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్, రాజం పేట్ సర్పంచ్ బుర్స పోచయ్య, కౌన్సిలర్లు కొండు భారతి, జాడి వినోద్ కుమార్, స్థానిక నాయకులు, రైతులు, వినియోగదారులు పాల్గొన్నారు.

### తిర్యాని పంచాయతీలో

## చలివేంద్రం ప్రారంభం

**- సర్పంచ్, ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రజలకు చల్లని నీటి సేవలు**

**తిర్యాని, మే7, ప్రభాతవార్త;**

ఎండలు మండిపోతున్న వేళ ప్రజలకు ఉపశమనం కలిగించే లక్ష్యంతో తిర్యాని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక కుమురం భీం చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం తిర్యాని సర్పంచ్ మడావి రాజేష్, ఉప సర్పంచ్ చేని కుమార్‌లు గ్రామ కార్యదర్శి రాజేశ్వరితో కలిసి ప్రారంభించారు. ఈ చలివేంద్రం ద్వారా ప్రయాణికులు, కూలీలు, రైతులు, విద్యార్థులు, స్థానిక ప్రజలకు చల్లని తాగునీరు అందించనున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్‌లు మాట్లాడుతూ మండుతున్న ఎండల్లో ప్రజలకు చల్లని నీరు అందించడం కన్నా గొప్ప సేవ మరొకటి లేదన్నారు. ప్రతి ఒక్కరూ సేవా భావంతో ముందుకు వచ్చి సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామంలో వేసవి కాలమంతా చలివేంద్రం నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులకు, వృద్ధులకు, చిన్నారులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సేవలో పంచాయతీ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ వేసవిలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్ళరాదని, బయటకు వెళ్ళే సమయంలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘం నాయకులు పెందోర్ ధర్ము, యూత్ నాయకులు పున్నం కుమార్, పంచాయితీ సిబ్బంది చిలుక రవి, గద్దల నరేష్, చిలుక రాములు, తదితరులు ఉన్నారు.



తిర్యానిలో చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

# రైతుల నుంచి చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

**(మొదటిపేజీ తరువాయి)**

రాకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో సంబంధిత నగదును జమ చేసే విధంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వేసవి దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళలలో ధాన్యం కొనుగోలు, రవాణా ప్రక్రియ కొనసాగించడం జరుగుతుందని, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో 1 లక్ష 83 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనా చేయడం జరిగిందని, ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం దెబ్బతినకుండా గోదాములలో నిల్వ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

అంతకుముందు రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్‌తో కలిసి చెన్నూర్ మున్సిపల్ కౌన్సిలర్లతో పట్టణ అభివృద్ధి పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థ ఏర్పాటు పనులను వేగవంతం చేసి పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో చెన్నూర్ మున్సిపల్ పరిధిలో చేపట్టిన రహదారి విస్తరణ, మురుగు కాలువల వ్యవస్థ నిర్మాణంలో భాగంగా నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల కారణంగా ఎవరికి ఎలాంటి నష్టం కలుగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రహదారి విస్తరణలో దుకాణాలు కోల్పోయిన వారికి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లో దుకాణాలు కేటాయించేందుకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, స్థలం కోల్పోయిన వారికి టిడిఆర్‌లో వెసులుబాటు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయంలో అనవసర పుకార్లను నమ్మవద్దని, ప్రజా సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యరంగం బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల బ్యూరో, మే 7, ప్రభాతవార్త**

ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా అనేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ నేపథ్యంలో చెన్నూర్ మండల కేంద్రంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఆసుపత్రుల నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, పనులు మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ గుత్తేదారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

**నస్పూర్, మే 7, ప్రభాతవార్త**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నిరుపేద నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు అధికారులు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి మున్సిపల్ కార్యాలయంలో ఈ ఎంపిక ప్రక్రియ జరిగింది. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, పాడి గేదెల యూనిట్ల మంజూరు కోసం అభ్యర్థుల అర్హతలను అధికారులు పరిశీలించారు. ఈ పథకం కింద వివిధ రకాల వ్యాపారాలు నెలకొల్పుకోవడానికి మొత్తం 309 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 153 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి వెంకటేశం, మున్సిపల్ కమిషనర్ అన్వేష్ అభ్యర్థుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. నిరుద్యోగ యువత సొంతంగా వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ రుణాలను మంజూరు చేస్తోందని అధికారులు వివరించారు. బ్యాంకుల నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ త్వరితగతిన రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి, వివిధ బ్యాంకుల మేనేజర్లు మస్తాన్ షేక్, రాజేష్, మెప్మా టీఎంసీ చంద్రయ్య, సిఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

## మున్నూరు కాపుల జనాభాను తక్కువగా చూపడం అన్యాయం

**- మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గాదె సత్యం**

**నస్పూర్, మే 7, ప్రభాతవార్త**

తెలంగాణలో మున్నూరు కాపుల జనాభా 40 లక్షలకు పైగా ఉంటే, కులగణనలో తక్కువగా చూపడం అన్యాయమని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గాదె సత్యం ఆరోపించారు. గురువారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర జనాభాలో సుమారు 9 శాతంగా ఉండాల్సిన తమ జనాభాను 6 శాతం కన్నా తక్కువగా చూపడాన్ని తీవ్రంగా ఖండించారు. బీసీ కులగణనను నిష్పక్షపాతంగా మళ్లీ నిర్వహించి వాస్తవ లెక్కలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని, ప్రభుత్వ సలహాదారుగా వి. హనుమంతరావును నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూనే, కార్పొరేషన్‌కు ఎన్నికల హామీ మేరకు నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సల్ల నరేష్, బోయిని హరికృష్ణ, తోట తిరుపతి, బండారి తిరుపతి, పుప్పాల స్వర్ణాకర్, రమేష్, రవీందర్, మల్లేష్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సైకాలజిస్ట్ సమాజం పట్ల బాధ్యతతో పనిచేయాలి: రంగు వేణు కుమార్

**- ప్రకృతి మిత్ర కార్యాలయంలో తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ దశాబ్ది ఉత్సవాలు**

**నస్పూర్, మే 7, ప్రభాతవార్త**

సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం విద్యార్థుల మానసిక ఒత్తిడిని తగ్గించడంలో సైకాలజిస్టుల పాత్ర అత్యంత కీలకం, ప్రతి సైకాలజిస్ట్ ఈ సామాజిక బాధ్యతను గుర్తించి పనిచేయాలిґґ అని టీపీఏ జిల్లా అధ్యక్షులు, అడ్వొకేట్, కౌన్సిలింగ్ సైకాలజిస్టు రంగు వేణు కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ (టీపీఏ) పదవ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మంచిర్యాల జిల్లా నస్పూర్ కలెక్టరేట్ రోడ్డులోని ప్రకృతి మిత్ర కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోత్కూరి రాంచందర్ సూచనల మేరకు జరిగిన ఈ వేడుకల్లో వేణు కుమార్ కేక్ కట్ చేసి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో ఈ ఏడాది టీపీఏ ఈవెంట్ క్యాలెండర్‌లోని కార్యక్రమాల అమలుపై చర్చించారు. మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సైకాలజీ కన్వెన్షన్ నిర్వహించాలని తీర్మానించారు. మే 9, 10 తేదీలలో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర కన్వెన్షన్, అవార్డుల ప్రధానోత్సవంలో జిల్లా నుంచి పలువురు సైకాలజిస్టులు పాల్గొంటారని వెల్లడించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా నుంచి రాష్ట్రవ్యాప్త కార్యక్రమ నిర్వహణకు అవకాశం ఇవ్వాలని రాష్ట్ర కమిటీని కోరారు. ముఖ్యంగా విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు సుప్రీంకోర్టు జారీ చేసిన 15 కీలక మార్గదర్శకాలను ప్రభుత్వం అమలు చేయాలని వేణు కుమార్ డిమాండ్ చేశారు. రాబోయే విద్యా సంవత్సరం నుంచి విద్యాసంస్థల్లో సైకాలజిస్టులు, కౌన్సిలర్ల నియామక ప్రక్రియలో టీపీఏ తరఫున పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ సుమన చైతన్య, అడ్వైజర్ గుండేటి యోగేశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, తాళ్లపల్లి కవిత తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర అభివృద్ధికి సెన్సస్ కీలకం

**- మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్**

**బెల్లంపల్లి, మే 07, ప్రభాతవార్త**

దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సెన్సస్-2027 కార్యక్రమంలో భాగంగా మొదటి దశ అయిన ఇండ్ల గణన (హౌస్ లిస్టింగ్) మే 11వ తేదీ నుండి ప్రారంభం కానుందని బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్, ఛార్జ్ ఆఫీసర్ తన్నీరు రమేష్ తెలిపారు. ఈ గణన ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు మున్సిపాలిటీ కార్యాలయంలో ఎనుమరేటర్లు, సూపర్వైజర్లకు అవసరమైన కిట్లు, ఫార్ములు, ఇతర సంబంధిత మెటీరియల్‌ను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సెన్సస్ గణన దేశ అభివృద్ధికి అత్యంత కీలకమైన ప్రక్రియ అని, ఈ గణన ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా ప్రభుత్వాలు ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తాయని చెప్పారు. ప్రతి ఇంటికి వచ్చే ఎనుమరేటర్లకు కుటుంబ వివరాలు, నివాస పరిస్థితులు, వసతులు వంటి అంశాలపై సరైన, సంపూర్ణ సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఇండ్ల గణనలో భాగంగా ప్రతి ఇంటిని సందర్శించి గృహ వివరాలు నమోదు చేయబడతాయని, ప్రజలు సహకరిస్తే ఈ ప్రక్రియ వేగంగా, ఖచ్చితంగా పూర్తవుతుందని తెలిపారు. ఎవరూ తప్పు సమాచారం ఇవ్వకుండా, పూర్తి సహకారం అందించడం ద్వారా ప్రభుత్వానికి నిజమైన డేటా అందించడంలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మజర్, పి.ఓ చంద్రశేఖర్, ఫీల్డ్ ట్రైనర్లు, ఎనుమరేటర్లు, సూపర్వైజర్లు, టి.పి.బి.ఓలు, టెక్నికల్ అసిస్టెంట్ రాజ్ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# గోదాముల్లో నిబంధనల ప్రకారం వరి నిల్వలు

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాలు



**బెల్లంపల్లి, మే 07, ప్రభాతవార్త**

వరి ధాన్యం నిల్వ చేసే గోదాముల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. గురువారం రోజున జిల్లాలోని కాసిపేట మండలం గుండ్లపహాడ్, బెల్లంపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం నిల్వ గోదాములను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, బెల్లంపల్లి తహసిల్దార్ కృష్ణలతో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గోదాములలో సక్రమంగా నిల్వ చేయాలని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 10 రైస్ మిల్లులు పనిచేస్తున్నాయని, సుముఖ్ గోదాం సామర్థ్యం 20 వేల మెట్రిక్ టన్నులు కాగా, ఇతర గోదాముల సామర్థ్యం కలిపి మొత్తం 61 వేల మెట్రిక్ టన్నులుగా ఉందని వివరించారు. ఈ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగిస్తూ నిల్వలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. మిల్లింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, వరి ధాన్యం రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియలో ఆలస్యం లేకుండా తగిన వాహనాలను కేటాయించాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అంతరాయాలు తలెత్తకుండా, హమాలి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బెల్లంపల్లి మండల కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి భూభారతి రెవెన్యూ దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. భూ సమస్యల పరిష్కారం కోసం అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డులతో సరిచూసి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంఘం చైర్మన్ దత్తు మూర్తి

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**తాండూర్, మే 7, ప్రభాతవార్త :**

మండలంలోని బోయపల్లి బోర్డు సమీపంలో ప్రాథమిక వ్యవసాయ శాఖ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సంఘం చైర్మన్ సుబ్బ దత్తు మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాసిపెట సర్పంచ్ ముదాం వనజ, డైరెక్టర్లు గట్టు మురళీధర్ రావు, మాసాడి తిరుపతి, దేవరకొండ రాజన్న, యంఏ రావుఫ్, రాజేశం, పులగం తిరుపతి, ఆర్ఐ బొలిశెట్టి పద్మజ, సహకార సంఘం జూనియర్ ఇన్స్పెక్టర్ సురేందర్, సిఇఓ అనిల్ కుమార్, నాయకులు చంద్రశేఖర్, మాసాడి శ్రీరాములు, గోవర్ధన్, నారాయణ, సిబ్బంది వెంకటేశం, రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా పెద్ద బోయిన శంకర్

**తాండూర్, మే 7, ప్రభాతవార్త :**



తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పెద్దబోయిన శంకర్ ను నియమిస్తూ టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంచిర్యాల డి సి సి అధ్యక్షుడు పిన్నింటి రఘునాథరెడ్డి లు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు . ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షునిగా ఎన్నికైన పెద్ద బోయిన శంకర్ మాట్లాడుతూ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు సహకారంతో మండలంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ పదవి వచ్చేందుకు సహకరించిన, నన్ను వెన్నంటి ప్రోత్సహించిన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, డిసిసి ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్వాజి మహేందర్ రావు , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, మాజీ జెడ్పీటిసి సాలిగామ బానయ్య, మాజీ మండల అధ్యక్షుడు ఎండి ఈసా, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కడారి రత్నాకర్ రావు, ఐ ఎన్ టి యూ సి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

**సిరికొండ, మే 07, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు అంబరాన్నంటాయి. గురువారం హనుమాన్ దీక్షాపరులు భారీ శోభాయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు. మాలధారణ చేసిన భక్తులు “జై శ్రీరామ్.. జై హనుమాన్“ అంటూ చేసిన నామస్మరణతో వీధులన్నీ మారుమోగాయి. శోభాయాత్ర సాగిన పురవీధుల్లో మహిళలు భక్తులకు మంగళ హారతులతో స్వాగతం పలికారు. కాషాయ జెండాలు, భజన కీర్తనల మధ్య సాగిన ఈ యాత్రలో యువత, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు స్థానికులు మంచినీరు, ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమం మండల కేంద్రంలో ఆధ్యాత్మిక శోభను నింపింది.



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

## లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

**భైంసా, మే 07, ప్రభాతవార్త:**

కుబీర్ మండలం మాలేగాం గ్రామానికి చెందిన లావణ్య కుటుంబ సభ్యులకు రూ. 54 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి గురువారం అందజేశారు. భైంసాలోని తన నివాసంలో ఈ చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం ఎంతో మేలు చేస్తుందన్నారు. చెక్కు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు నియోజకవర్గ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మైపాల్ రెడ్డి, రమణారెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.





ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కంపెనీ ప్రతినిధులు

## ఆయిల్ ఫామ్ సాగుతో రైతులకు సిరులు

**సిరికొండ, మే 07, ప్రభాతవార్త:**

నీటి వసతి ఉన్న ప్రతి రైతూ ఆయిల్ ఫామ్ సాగు వైపు మళ్లాలని ఆయిల్ ఫామ్ ప్రీ యూనిక్ కంపెనీ ఏజీఎం సూచించారు. గురువారం సిరికొండ రైతు వేదికలో ఆయిల్ ఫామ్ సాగు, పీఎం కుసుం పథకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకు ఒకసారి చెట్టు మొదలు తడిసేంత నీరున్నా ఈ పంటను సాగు చేయవచ్చన్నారు. ప్రభుత్వం సబ్సిడీ కింద ఒక్కో మొక్కను రూ. 20కే అందిస్తోందని, ఎకరాకు 50 మొక్కలు నాటుకోవాలని తెలిపారు. తోటల్లో అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని, సాగు ఖర్చును కూడా రైతులకు తిరిగి చెల్లిస్తామని వివరించారు. మార్కెట్‌లో టన్ను గెలలకు రూ. 23 వేల నుండి రూ. 25 వేల వరకు ధర పలుకుతోందని, ఇది రైతులకు ఎంతో లాభదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మండల కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

## ఛలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి: బీజేపీ

**జైనూర్, మే 07, ప్రభాతవార్త:**

హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 10న నిర్వహించే బీజేపీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం జైనూర్ మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరవుతున్న ఈ మహాసభకు జైనూర్ మండలం నుండి కార్యకర్తలు, యువత, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. దేశాభివృద్ధి, సుశాసనం లక్ష్యంగా జరుగుతున్న ఈ సభను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మెస్రం జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షుడు మడావి నాగోరావ్, ప్రధాన కార్యదర్శి మధురాజ్ మడావి, కార్యదర్శి ఆడ సింగు, బీజేవైఎం ఉపాధ్యక్షుడు తుమ్రం దిలీప్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

## రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు

**నేరడిగొండ, మే 07, ప్రభాతవార్త:**




మండలంలోని వాంకిడి గ్రామంలో వ్యవసాయ కళాశాల ఆదిలాబాద్ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు మంజులత, అనిత మాట్లాడుతూ సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించి, అవసరం మేరకే పురుగు మందులు వినియోగించాలని సూచించారు. విత్తన శుద్ధి, పంట మార్పిడి పద్ధతులు పాటించాలని, పసుపు స్టిక్కీ ట్రాప్స్, ఫెరోమోన్ ట్రాప్స్ వంటి సమగ్ర కీటక నిర్వహణ పద్ధతుల ద్వారా చీడపీడలను అదుపు చేయవచ్చని వివరించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రశీదులను భద్రపరుచుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు చెట్లను పెంచాలని, సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారి హరీష్, రాథోడ్ సందీప్, ముల్లవర్ రవి, లక్ష్మి ఉషాన్న, గోవింద్, రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సోషల్ మీడియా ఇంఛార్జ్ రాజీనామా

**భైంసా, మే 07, ప్రభాతవార్త:**



ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ పదవికి కాంబ్లె సాహెబ్ రావు రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నిబద్ధతతో పనిచేసినా, స్థానిక నాయకత్వం నుండి తగిన గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ కోసం శ్రమించినా, స్థానిక ఇంచార్జ్ భోస్లే నారాయణ్ రావు పాటిల్ తనను విస్మరించి టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. నిబద్ధత కలిగిన కార్యకర్తలకు న్యాయం జరగడం లేదని మనస్తాపానికి గురై పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. తన రాజీనామాను తక్షణమే ఆమోదించాలని కోరారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

## వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రామారావు పటేల్

**భైంసా, మే 07, ప్రభాతవార్త:**

ముధోల్ మండలంలోని తరోడా గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసి అండగా నిలుస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఐకేపీ సిబ్బంది, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం నిల్వ సామర్థ్యాన్ని పరిశీలించిన కలెక్టర్

**నిర్మల్, మే 07, ప్రభాతవార్త:**

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, సేకరించిన ధాన్యాన్ని భద్రపరిచేందుకు చేపట్టిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం మామడ మండల కేంద్రంతో పాటు లక్ష్మణచాంద మండలంలోని తిరుపెల్లి గ్రామంలో ఉన్న గోదాములు, రైస్ మిల్లులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ధాన్యం తడవకుండా మిల్లుల వద్ద సరిపడా టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలని మిల్లర్లకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించాలని అధికారులను ఆదేశించారు. నిల్వ సామర్థం విషయంలో సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్, తహసీల్దార్ సరిత, అధికారులు పాల్గొన్నారు.



ధాన్యం నిల్వ సామర్థ్యం, గోదాములను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**హాజీపూర్,మే 7,ప్రభాతవార్త**



ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు పూర్తి చేయాలని, జిల్లాలో మిల్లింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే వరి తప్పనిసరిగా శుభ్రపరచి, నాణ్యత ప్రమాణాలు పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అంతరాయాలు రాకుండా, హమాలి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తమ బాధ్యతలను క్రమంగా నిర్వర్తిస్తూ, రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలును పారదర్శకంగా చేపట్టి సమయానికి పూర్తి చేయాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో తడిచిన ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టి కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షానికి తడిసిన ధాన్యం

### - నర్సాపూర్ (జి) రైతుల ఆందోళన

**నర్సాపూర్(జి), మే 07, ప్రభాతవార్త:**

మండలంలోని నర్సాపూర్(జి) గ్రామపంచాయతీ పరిధిలో కురిసిన అకాల వర్షానికి రైతులు ఆరబోసిన మొక్కజొన్న, వరి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. మార్కెట్‌కు తరలించి విక్రయానికి సిద్ధంగా ఉంచిన పంట వర్షార్పణం కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో కురిసిన ఈ వర్షం వల్ల ధాన్యం నాణ్యత దెబ్బతింటుందని, తద్వారా మద్దతు ధర లభిస్తుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు రాము, సతీష్, పాషా, రవి, ఆనంద్, భూమన్న, శంకర్, శీను, పురుషోత్తం, గంగరాజు, సురేష్, పోషణ పాల్గొన్నారు.



తడిసిన మొక్కజొన్న, వరి ధాన్యాన్ని పరిశీలిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న పంట దగ్ధం

**సారంగాపూర్, మే 07, ప్రభాతవార్త:**

మండలంలోని కౌట్ల (బి) గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఎకరం మేర మొక్కజొన్న పంట దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు అట్ల ముత్యం రెడ్డి తన మూడెకరాల పొలంలో మొక్కజొన్న సాగు చేయగా, గురువారం వీచిన ఈదురు గాలులకు విద్యుత్ వైర్లు రాపిడికి గురై నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. దీంతో పంటకు నిప్పు అంటుకుని ఎకరం మేర కాలిపోయింది. సమాచారం అందుకున్న ఆర్ఐ వెంకట్ నర్సయ్య, జీపీఓ ప్రవళిక క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించారు. పంట నష్టానికి సంబంధించిన నివేదికను పై అధికారులకు అందిస్తామని రైతుకు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, నాయకులు సోమిరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.






రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సంచాలకులు కృష్ణ

## రైతులకు డ్రోన్ల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు

**లక్షెట్టిపేట, మే 07, ప్రభాతవార్త**

వ్యవసాయంలో డ్రోన్ల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి ఆర్ శ్రీకాంత్ తెలిపారు. గురువారం రోజున ఉదయం 10 గంటలకు రైతు వారోత్సవాలను పురస్కరించుకుని వెంకట్రావు పేట రైతు వేదికలో రైతులకు నియోజకవర్గ స్థాయి మీటింగ్‌లో భాగంగా పిఎం కుసుం, వ్యవసాయంలో డ్రోన్ల యొక్క ప్రాముఖ్యతపై వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు, మంచిర్యాల ఎం. కృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి గోపి, డిఇ, ఏడిఈ, టిఎస్ ఎన్పీడీసీఎల్, టీఎస్ రెడ్ కో జిల్లా మేనేజర్, డివిజన్‌కి సంబంధించిన మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఆర్టిఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ నలిమెల రాజు రైతులు పాల్గొనడం జరిగింది.

## పదవ తరగతిలో సత్తాచాటిన మనస్వితకు ఘనంగా సన్మానం

### - నక్కలపల్లి విద్యార్థిని ప్రతిభపై గ్రామస్తుల హర్షం

**కోటపల్లి, మే 07 ప్రభాతవార్త**

నక్కలపల్లి గ్రామానికి చెందిన రాగుల సంధ్యారాణిరాములు కుమార్తె మనస్విత పదవ తరగతి వార్షిక ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచింది. కోటపల్లి మోడల్ స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న మనస్విత, ఇటీవల విడుదలైన ఫలితాల్లో 550 మార్కులు సాధించి అందరి ప్రశంసలు అందుకుంటుంది. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ తోట అశోక్, గ్రామస్తులు నరేందర్ రెడ్డి, మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో మనస్వితను ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన విద్యార్థిని పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. మనస్విత భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# నేడు జిల్లాకు మంత్రులు రాక...

## - తుమ్మడిహెట్టి ప్రాంతంలో క్షేత్రస్థాయి పర్యటన

**ఆసిఫాబాద్, మే 7, ప్రభాతవార్త :**

కుమురం భీం జిల్లాలోని తుమ్మడిహెట్టి ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు లు కలిసి శుక్రవారం ఉదయం 7:30 గంటలకు క్షేత్రస్థాయి పర్యటన చేయనున్నారు. ప్రాణహిత ప్రాజెక్టులో కీలకమైన తుమ్మడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణం, నీటి లభ్యత, ముంపు, సాగునీటి పారుదల వంటి అంశాలపై మంత్రులు లోతుగా సమీక్షించనున్నారు. పర్యటనలో భాగంగా మంత్రులు సంబంధిత నీటి పారుదల శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశం కానున్నారు. బరాజ్ నిర్మాణానికి సంబంధించి ప్రస్తుతం ఉన్న నీటి లభ్యత గణాంకాలు, రైతులకు అందాల్సిన ప్రయోజనాలపై అక్కడికక్కడే చర్చించి, భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి మండల అధ్యక్షుడు ఆడే సురేష్ నాయక్

# బీజేపీ లింగాపూర్ మండల కార్యవర్గ సమావేశం

**లింగాపూర్, మే 07, ప్రభాతవార్త :**

బీజేపీ లింగాపూర్ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఈ నెల 10వ తేదీన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు హాజరై భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుంది, భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే బూత్ లెవెల్ కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి చేరే విధంగా కృషి చేయాలి, భవిష్యత్ కార్యాచరణ పార్టీ ప్రతిష్ట పై కీలక సలహా సూచనలు కల్పించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఆడే సురేష్ నాయక్, జనరల్ సెక్రటరీలు బానోత్ అశ్విన్, జాధవ్ సచిన్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ చారి, బీజేవైఎం మండల ఉపాధ్యక్షులు ఆడే అరవింద్, బీజేవైఎం మండల ఇంచార్జ్ వికాస్, మామిడిపల్లి బూత్ అధ్యక్షులు సేవాలాల్, మండల నాయకులు ఆడే కేతన్ , జాధవ్ సాయి క్రిష్ణ, పవార్ ప్రవీణ్, చవాన్ క్రిష్, రాథోడ్ సచిన్, రాథోడ్ అశోక్ తదితరులు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి మంద మకరందు

**నస్పూర్, మే 7, ప్రభాతవార్త**

సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థఉట్నూర్ ప్రాజెక్టు అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మంద మకరందు గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని డిసిపి కార్యాలయంలో డిసిపి ఎ. భాస్కర్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.



# ధాన్యం కొనుగోలులో తరుగుపేరుతో రైతులను దోచుకుంటున్నారు

## - బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వ లక్ష్మి నారాయణ - నస్పూర్‌లో జాతీయ రహదారి పై బీజేపీ భారీ ధర్నా

## - అకాలవర్షం వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్

**నస్పూర్, మే 7, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం తరుగు పేరుతో రైతులు పండించిన ధాన్యాన్ని బస్తాకు నాలుగు కిలోల చొప్పున దోచుకుంటోందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వ లక్ష్మి నారాయణ ఆరోపించారు. మంచిర్యాల జిల్లాలో ఎలాంటి తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, అకాల వర్షం వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం బీజేపీ ఆధ్వర్యంలో నస్పూర్‌లోని జిల్లా కలెక్టరేట్ సమీపంలో జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ నిరసనలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. కాంటా వేసిన ధాన్యాన్ని లారీల కొరత కారణంగా మిల్లులకు తరలించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని లక్ష్మి నారాయణ విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యేలు రైస్ మిల్లర్లతో కుమ్మక్కై కమీషన్ల కోసం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. లక్షెట్టిపేట మండలంలో ఇటీవల మరణించిన నలుగురు రైతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 50 లక్షల రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు విధించకుండా తక్షణమే ధాన్యం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతులకు రశీదులు అందజేయాలని నాయకులు పేర్కొన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దుర్గం అశోక్, కొయ్యల ఎమాజీ, కోడి రమేష్, గోపతి రాజన్న, అమిరిశెట్టి రాజ్ కుమార్, కుర్రె చక్రి, సత్రం రమేష్, రంగ శ్రీశైలం, వీరమల్ల హరి గోపాల్ సహా పలువురు కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



రైతుల సమస్యలపై ధర్నా చేస్తున్న బస్వ లక్ష్మి నారాయణ, రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ శ్రేణులు



వరి ధాన్యం కొనుగోలు చేయాలని గుడిపేట జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

# వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

**హాజీపూర్, మే 07, ప్రభాతవార్త**

కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు అన్నారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని గుడిపేటలో రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేస్తూ గురువారం రోజున గుడిపేట జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్య గత కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం తడిసి ముద్దవుతుందని అన్నారు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో వర్షాలు పడి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వారు కోరారు. జాతీయ రహదారిపై ధర్నాకు దిగడంతో హాజపూర్ ఎస్సై కిరణ్ కుమార్ రైతులతో మాట్లాడి, ఈ విషయాన్ని పై అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కారం అయ్యేలా చేస్తానని చెప్పడంతో రైతులు ధర్నాను విరమించారు. సుమారు గంట పాటు ట్రాఫిక్ స్తంభించి, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

# కోసిని గ్రామపంచాయతీలో ఎర్తింగ్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం

**కాగజ్‌నగర్ రూరల్, మే 7, ప్రభాతవార్త :**



కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామపంచాయతీ పరిధిలో ఇళ్లలో సరైన ఎర్తింగ్ అందక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కరెంట్ ఎర్త్ పైపులకు నీరు పోసి ఎర్తింగ్ సక్రమంగా పనిచేసేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వసాకే పుల్లాభాయ్ పాల్గొని ప్రజలకు విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించారు. అలాగే కరెంట్ లైన్‌మన్ సత్యం, సెక్రటరీ రాజేశ్వర్ ఆధ్వర్యంలో ఎర్తింగ్ వ్యవస్థను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకున్నారు. గ్రామ ప్రజలు కూడా కార్యక్రమంలో పాల్గొని సహకరించారు. గ్రామంలో విద్యుత్ సమస్యలు తగ్గి ప్రజలకు మెరుగైన సేవలు అందేలా గ్రామపంచాయతీ కృషి చేస్తోందని సర్పంచ్ తెలిపారు.

# జీ.ఓ. 7ను వెంటనే వెనక్కి తీసుకోవాలి

## - విద్యార్థి సంఘాల డిమాండ్

**బెల్లంపల్లి, మే 07, ప్రభాతవార్త**

తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీ.ఓ. నంబర్ 7ను వెంటనే వెనక్కి తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మనబోయిన సైదులు యాదవ్ ఆధ్వర్యంలో ఐక్య విద్యార్థి సంఘాలు జీ.ఓ. 7 ప్రతులను చించివేస్తూ నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ విద్యార్థి సమైఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ మాట్లాడుతూ జీ.ఓ. 7 విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే విధంగా ఉందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పాత విధానంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. జీ.ఓ. 7 ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని ఎత్తివేసే కుట్ర జరుగుతోందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఒకవైపు కోర్సు పూర్తి చేసిన విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేయవద్దని సూచిస్తుండగా, మరోవైపు ప్రైవేట్ కళాశాలలు నిబంధనలను పట్టించుకోకుండా విద్యార్థులపై అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా విద్యార్థుల సమస్యలపై స్పష్టత ఇవ్వకుండా అనాలోచిత విధానాలు అమలు చేస్తోందని వంశీ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. విద్యాశాఖ విధానాలు అణగారిన వర్గాల విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసేలా ఉన్నాయని విమర్శించారు. ఇంటర్ బోర్డు మే 8 వరకు అడ్మిషన్లు చేపట్టవద్దని సూచించినప్పటికీ, ప్రైవేట్ కళాశాలలు ముందుగానే 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు చేపట్టి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని తెలిపారు. మాదాపూర్ వంటి ప్రాంతాల్లో ఇప్పటికే తరగతులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. విద్యా విధానాల రూపకల్పనలో అనుభవం కలిగిన విద్యావేత్తల సూచనలు తీసుకోవాలని, తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ సలహాలను మాత్రమే కాకుండా విస్తృతంగా చర్చలు జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓయూ విద్యార్థి నాయకులు ప్రభాకర్, అనిల్, సాయి కిరణ్, కుమార్, సంజయ్, శివ, అనిల్ నాయక్, నరేష్, సురేష్, అభి తదితరులు పాల్గొన్నారు.



### ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను

# పకడ్బందీగా నిర్వహించాలి

**ఆసిఫాబాద్, మే 7, ప్రభాతవార్త :**


మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్

ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అధికారులకు సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 13 నుండి 21 వరకు జరగనున్న ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. పరీక్షల నిర్వహణ కొరకు జిల్లాలో 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రథమ సంవత్సరం ఒకేషనల్ కోర్సుతో కలిపి 1770 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 697 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షలను పూర్తి ప్రశాంత వాతావరణంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని, ప్రశ్నా, జవాబు పత్రాలు పూర్తి బందోబస్తు మధ్య తరలించాలని, పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్, సెట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించాలని తెలిపారు. పరీక్షలను అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాధ్యమిక విద్యాధికారి రామ్ దాస్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళులు

**మందమర్రి, మే 7, ప్రభాతవార్త**



మందమర్రి పట్టణంలో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా మాజీ ఆర్మీ జవాన్, ప్రస్తుత ఎస్ అండ్ పీసీ ఉద్యోగి రాజేష్ పీవీ హాల్, రాణి పీవీ హాల్ దంపతులు గురువారం తమ నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు 1897 జూలై 4న విశాఖపట్నం జిల్లా పాండ్రంగి గ్రామంలో జన్మించారని తెలిపారు. దేశానికి స్వాతంత్రం సాధించాలనే సంకల్పంతో గిరిజనులపై బ్రిటిష్ ప్రభుత్వం అమలు చేసిన అటవీ చట్టాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించారని పేర్కొన్నారు. గిరిజనులను ఏకం చేసి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధాన్ని చేపట్టి, చింతపల్లి, రంపచోడవరం, అడ్డతీగల ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్లపై దాడులు చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారని గుర్తుచేశారు. ఆయనను పట్టుకోవడానికి బ్రిటిష్ ప్రభుత్వం భారీగా నగదు బహుమతి ప్రకటించినప్పటికీ, చివరకు 1924 మే 7న బ్రిటిష్ అధికారులు బంధించి కాల్చిచంపారని తెలిపారు. అల్లూరి సీతారామరాజు త్యాగాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ కార్మికుడు పెందోట వెంకట నరసయ్య పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోళ్లు చేపట్టండి

**- నిర్వాహకులకు సూచించిన అడిషనల్ కలెక్టర్ వి. రాములు**

**- మండలంలోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల సందర్శన**

**చెన్నూరు, మే 7, ప్రభాతవార్త**



రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వడ్ల కొనుగోళ్లు చేపట్టాలని కేంద్రాల నిర్వాహకులకు జిల్లా అడిషనల్ కలెక్టర్ వి. రాములు సూచించారు. జిల్లాలోని చెన్నూరు మండలం సోమనపల్లి, ఆస్నాద్ గ్రామాల్లోని పిఏసిఎస్, ఐకెపి, డిసిఎంఎస్ కొనుగోలు కేంద్రాలను గురువారం రోజున ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్ నిర్వాహకులతో మాట్లాడుతూ, రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు కేంద్ర నిర్వాహకులకు సహకరించి సమన్వయం పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మల్లికార్జున్, ఏపిఎం వెంకటేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌గా ప్రకాష్ పదవీ బాధ్యతలు

**చింతలమానేపల్లి, మే 7, ప్రభాతవార్త:**



మండల తహసీల్దార్‌గా గేడెం ప్రకాష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన వెంకటేశ్వరరావుకు అదనపు కలెక్టర్‌గా పదోన్నతి లభించడంతో, ఆయన స్థానంలో భీమిని మండలం నుంచి గేడెం ప్రకాష్‌ను బదిలీపై నియమించారు. రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి బాధ్యతలు అప్పగించారు. మండలంలో భూమి సమస్యలు, పోడు భూముల వివాదాలు, ధరణి అంశాలు, పట్టాదారు పాస్‌బుక్స్ వంటి సమస్యలు ఎక్కువగా ఉండటంతో రెవెన్యూ పరిపాలనకు ప్రాధాన్యం ఉంది. ఈ నేపథ్యంలో కొత్త తహసీల్దార్ బాధ్యతలు స్వీకరించడం ప్రజల్లో ఆశలు రేకెత్తిస్తోంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎమ్మార్వో ప్రకాష్ మాట్లాడుతూ ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం: మేయర్ ధర్ని మధుకర్

**- రాజీవ్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ**

**నస్పూర్, మే 7, ప్రభాతవార్త**



వైద్యులు సకాలంలో అందుబాటులో ఉండి ప్రజలకు అన్ని రకాల వైద్య పరీక్షలు, చికిత్సలు అందించాలని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ స్పష్టం చేశారు. గురువారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్ రాజీవ్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యుల హాజరు పట్టికను, ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, మందుల నిల్వలను మేయర్ స్వయంగా పరిశీలించారు. సామాన్యులకు వైద్యం అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కేంద్రాలను నిర్వహిస్తోందని, ఇక్కడ నాణ్యమైన సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే రోగులను పెద్ద ఆసుపత్రులకు రెఫరల్ చేయాలని సూచించారు. అనంతరం మేయర్ జిల్లా వైద్యాధికారితో ఫోన్‌లో మాట్లాడి, ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను వివరించారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు కంకణాల శ్యాంసుందర్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.


మంటలు ఆర్పుతున్న గ్రామస్తులు

## గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం..

**- త్రుటిలో తప్పిన ప్రాణాపాయం**

**మందమర్రి, మే 7, ప్రభాతవార్త**

మందమర్రి మండలంలోని చిర్రకుంట గ్రామంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. గ్యాస్ సిలిండర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇంటి అంతటా వ్యాపించడంతో భారీ నష్టం సంభవించింది. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న వారు తృటిలో బయటపడటంతో పెను ప్రాణాపాయం తప్పింది. గ్రామానికి చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి సంద్ర రాజలింగు నివాసంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం ప్రకారం, ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ అకస్మాత్తుగా పేలిపోవడంతో మంటలు ఎగిసిపడి ఇంటి మొత్తం మంటల్లో చిక్కుకుంది. ప్రమాద సమయంలో ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు అప్రమత్తమై వెంటనే బయటకు పరుగులు తీయడంతో ప్రాణాలతో బయటపడ్డారు. మంటల తీవ్రతకు ఇంట్లోని ఫర్నిచర్, గృహోపకరణాలు, ధాన్యం నిల్వలు, నగదు, బంగారు ఆభరణాలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. దీంతో బాధిత కుటుంబం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ప్రమాదాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. అనంతరం ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో అక్కడికి చేరుకుని శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని కోరుతున్నారు. అగ్ని ప్రమాదానికి గల పూర్తి కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

## బెల్లంపల్లి పట్టణ అభివృద్ధి దిశగా ముందడుగు

**- ఎమ్మెల్యే వినోద్‌ను కలిసిన కమిషనర్ రమేష్**

**బెల్లంపల్లి, మే 07, ప్రభాతవార్త**

బెల్లంపల్లి మున్సిపాలిటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తన్నీరు రమేష్ గురువారం రోజున బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కమిషనర్ రమేష్ గడ్డం వినోద్ కి పుష్పగుచ్ఛం అందజేసి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. పట్టణాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రణాళికాబద్ధ చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచేందుకు అధికారులు కట్టుదిట్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యంగా మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలని తెలిపారు.

## వరి ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

**- బండారు రవికుమార్ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు**

**లక్షెట్టిపేట, మే 07, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మండలం గంపలపల్లి గ్రామంలో చనిపోయిన తనుగుల నాగరాజు, అభిలాష్ (తండ్రి కొడుకులు), కొత్తూరు గ్రామంలో గుండారపు వెంకటేష్( 23) రైతు కుటుంబాలను సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యులు పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా బండారు రవికుమార్ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, పైళ్ల ఆశయ్య సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. వరి ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నాలుగురు ప్రాణాలు కోల్పోవడం జరిగింది. వరి ధాన్యం కోసి 25 రోజులు గడిచిన ఇంకా కల్లాలకే పరిమితమైన వరి ధాన్యం అకాల వర్షం, గాలి దుమారాం నుంచి కాపాడుకునే క్రమంలో అక్కడ గోడ ప్రక్కన నిలవడం వల్ల గాలి దుమారానికి ఆ గోడ కూలి ముగ్గురు రైతులు, ఒక కౌలు రైతు చనిపోయారు. చనిపోయిన రైతు కుటుంబాల బాధ వర్ణనాతీతం. ప్రభుత్వం సరైన సమయంలో వరి కొనుగోలు చేస్తే ఇలా జరిగి ఉండేది కాదన్నారు. చనిపోయిన రైతు కుటుంబాలను ఇప్పటివరకు అధికారులు కానీ, నాయకులు పరామర్శించలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా వరి కొనుగోళ్లు వేగవంతం చేసి కోతలు లేకుండా చూడాలి. చనిపోయిన రైతు కుటుంబాలకు ఒక కోటి రూపాయలు చెల్లించాలని సిపిఎంగా డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో సంకె రవి సిపిఎం జిల్లా కార్యదర్శి, కనికరపు అశోక్, గోమాస ప్రకాష్, బోడెంకి చందు సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు ఉమారాణి, దూలం శ్రీనివాస్, దాగం రాజారామ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.